

# నవభూమి

## నల్లగొండ

అనుబంధం

26 అక్టోబర్,2024 శనివారం | పేజీలు:5

www.epaper.navabhoomi.in


వికసిత్ భారత్

# లక్ష్యం కావాలి

## గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



**సూర్యాపేట–నవభూమి:** భారతదేశం 2047 నాటికి అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించి వికసిత్ భారత్ కావాలని, అదే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆకాంక్షించారు. గురువారం సూర్యాపేట జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం సమావేశ మందిరంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. 2021లో జిల్లాలో 73శాతంగా ఉన్న రక్తహీనతను ఈ ఏడాదికి 21శాతానికి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను పూర్తి వివరాలతో సమర్పిస్తే రాష్ట్రవ్యాప్తంగా రక్తహీనతను నివారించేందుకు ఉపయోగపడుతుందన్నారు. స్వచ్ఛభారత్ అనేది కార్యక్రమం కాదని అదొక ఉద్యమమన్నారు. జిల్లాలో 475 గ్రామపంచాయతీలు బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలు ప్రకటించడం సంతోషకరమన్నారు. స్వచ్ఛభారత్‌లో అన్నివర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాలోని ప్రజలను దారిద్ర్యరేఖ నుంచి పైకి తీసుకువచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులను భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో స్వయంసహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు బాగున్నాయని, భవిష్యత్ అభివృద్ధి మహిళా సాధికారితపై ఆధారపడి ఉందన్నారు. మహిళల చేతుల్లో డబ్బులు ఉన్నప్పుడు ఆర్థిక సాధికారత వస్తుందన్నారు. స్వయంశక్తితో ఉపాధి కల్పించుకుని విజయాలు సాధించిన మహిళలను సమాజానికి తెలియజేయాలని, అప్పుడే ఇతరులు వారిని స్ఫూర్తి తీసుకుని అభివృద్ధి చెందుతారన్నారు. జిల్లాలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. వారికి విద్యతో పాటు చేతివృత్తులకు సంబంధించిన వస్తువుల తయారీపై అవగాహన కల్పిస్తే ఇంకా విజ్ఞానవంతులు అయ్యే అవకాశం ఉంటుందన్నారు.సమాజం అంటే సంపద కాదని, సమాజం అంటే సంస్కృతి అన్నారు. ముందుగా కలెక్టరేట్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ బుర్రా వెంకటేశం, జాయింట్ సెక్రటరీ భవానీశంకర్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, కోదాడ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్‌పద్మావతిరెడ్డి, సూర్యాపేట, హుజూర్‌నగర్, తిరుమలగిరి మునిసిపల్ చైర్‌పర్సన్లు పెరుమాళ్ల అన్నపూర్ణ, అర్చన, అనసూర్య, కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు వెంకన్నయాదవ్ పాల్గొన్నారు.

## పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలంటూ ఏబీవీపీ ధర్నా





# దుర్భాషాలాడటం కాంగ్రెస్‌కు తగదు

- మాజీమంత్రి జగదీశ్,మాజీఎమ్మెల్యే గాదరిపై కాంగ్రెస్ దుర్భాషలు
- సోషల్ మీడియా, పేపర్ల ప్రచారమే బిఎల్అర్ చేసిందేమీ లేదు
- బిఆర్ఎస్ గిరిజన నాయకులు ఎద్దేవా

**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 25:–** మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, భూపాల్ రెడ్డిలపై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు, దుర్భాషలాడడాన్ని బిఆర్ఎస్ నాయకులు అడవిదేవులపల్లి మాజీ ఎంపీపీ బాలాజీనాయక్, ఎల్.హాథిరాంనాయక్, మాజీ సర్పంచ్ ప్రకాష్ నాయక్, డి.రవినాయక్ లు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల నుంచి ప్రజలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారన్నారు. నల్గొండ జిల్లాలో ఇసుక మాఫియా కాంగ్రెస్ నేతల కనుసన్నలలోనే నడుస్తుందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన తండాలను గ్రామపంచాయతీ లాగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసిన బిఆర్ఎస్ నేతలపై నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. శంకర్ నాయక్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలన్నారు. బిఆర్ఎస్ నాయకుల జోలికి వస్తే కాంగ్రెస్ నేతలకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. దామరచర్ల మండలం భూఅక్రమణల్లో మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు పై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఒక్క ఆధారం ఉన్న చూపాలని, ఆధారం లేకుండా కాంగ్రెస్ నేతలు విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. ఎమ్మెల్యే బిఎల్ఆర్ సోషల్ మీడియాలో ప్రచారం తప్ప చేసిందేమీ లేదన్నారు. శంకర్ నాయక్ మాట్లాడిన తీరు సరైంది కాదని తన మాటలను ఉప సంహరించుకోవాలన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ లు రవీందర్ నాయక్, పాచు నాయక్, మిర్యాలగూడ పట్టణ బిఆర్ఎస్ నాయకులు పి.శ్రీనివాస్ యాదవ్, సాధినేని శ్రీనివాస్, వీర్లపాలెం బిఆర్ఎస్ నాయకుడు వినోద్ నాయక్, ఎండీ.ఫయాజ్ పాల్గొన్నారు.



# జిల్లా చేనేత జన సమాఖ్య అధ్యక్షులుగా కర్నాటి పురుషోత్తం

## ఎన్నికైన చేనేత జన సమైక్య నూతన కమిటీ



**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి అక్టోబర్ 25** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో బుధవారం జిల్లా చేనేత జన సమైక్య సర్వసభ్య సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర చేనేత జన సమాఖ్య అధ్యక్షులు చింతకింది రమేష్ హాజరైజిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్నాటి పురుషోత్తం రెండోసారి ఎన్నికగా, ఉపాధ్యక్షులుగా రాపోలు సత్యనారాయణ ,మిరియాల నాగార్జున, ప్రధాన కార్యదర్శిగా ఆటిపాముల మహేందర్ ,సహాయ కార్యదర్శిగా ఈపూరి విష్ణు, కోశాధికారిగా బింగి భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్ ,గజ్జల రామకృష్ణ ,గంజి చంద్రయ్య ,కూరపాటి అంజయ్య, ఇమ్మటి ఈశ్వర్ ,కర్నాటి జనార్ధన్ ,సంగిశెట్టి లక్ష్మీనారాయణ, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ చేనేత సమస్యల కోసం నిరంతరంగా చేనేత జన సమైక్య సంఘం పనిచేస్తుందని ఆయన అన్నారు. కార్మికుల సమస్యలు వారికి అండగా నిలుస్తారని తెలిపారు.

# మూసి పునర్జీవానికి మద్దతుగా

## ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలి

### సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ శాఖ అధ్యక్షుడు భారత లవ కుమార్

**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి అక్టోబర్ 25** మూసి పునర్జీవానికి మద్దతుగా చేపడుతున్న పిల్లాయిపల్లి లో శనివారం భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజా చైతన్య యాత్రకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కాంగ్రెస్ పట్టణ , మండలశాఖ అధ్యక్షులు భారత లవ కుమార్ ,పాక మల్లేష్ యాదవ్ కోరారు.పురపాలక కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వేరువేరుగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు భాగంగా మూసి ప్రక్షాళన ద్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని వారు తెలిపారు ,దీనికి అనుగుణంగా మూసి ప్రక్షాళన కార్యక్రమం ఇప్పటికే ప్రారంభం అయిందని వారు తెలిపారు. మూసి ప్రక్షాళనకు సంబంధించిన అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో పిలాయిపల్లి గ్రామం నుండి మక్తనంతారం మూసి బ్రిడ్జి వరకు చేపట్టిన పాదయాత్రకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తోపాటు రాష్ట్రానికి చెందిన ప్రముఖ నాయకులంతా తరలివస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతానికి లో మూ సిపై ఆధారపడ్డ రైతులు ,ముదిరాజ్ బిడ్డలు, కులవృత్తులకు వృత్తిదారులు, ఈ ప్రజా చైతన్య యాత్రకు పార్టీలకు అతీతంగా స్వచ్ఛంగా తరలివచ్చి మూసి అవగాహన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్ భోగభానుమతి విష్ణు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మద్ది అంజిరెడ్డి, కుక్క దానయ్య, నాయకులు కొట్టం కరుణాకర్ రెడ్డి పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మెరుగు శశికళ, సీనియర్ నాయకులు అంజమ్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కుడికాల సృజన, భక్తాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ కడివేర వెంకటేశం, నాయకులు కురపాటి బాబు, ఆటిపాముల నాగేష్, జోగు శ్రీనివాస్, యువజన నాయకులు కీర్తి సంజీవ, జింకల జై ,సూర్య ,మహేష్, శ్రీకాంత్ ,బాల నరసింహా, తో పాటు మహిళ కార్యకర్తలు గుర్రం హేమలత, వనమోని కావ్య, జింకల స్వరూప, సొల్లు మమత, తదితరులు ఉన్నారు.



## పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు

# వెంటనే విడుదల చేయాలంటూ ఏబీవీపీ ధర్నా

**మిర్యాలగూడ–నవభూమిప్రతినిధి అక్టోబర్ 25:–** ఎబివిపి మిర్యాలగూడ నగర కార్యదర్శి బొల్లేపల్లి మధు మోహన్ రాజు ఆద్వర్యంలో స్థానిక రాజీవ్ చౌక్ వద్ద విద్యార్థులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ సంపత్, నగర కార్యదర్శి మధు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత పాలకులు విద్యారంగాన్ని నిర్లక్ష్యం, ప్రస్తుత ప్రభుత్వం సైతం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మరింత విధ్వంసం చేస్తుందని . స్వయంగా రాష్ట్ర సిఎం పర్యవేక్షిస్తున్న విద్యారంగానికి బడ్జెట్ కనీస నిధులు కేటాయించకుండా గతం కంటే తక్కువ 6.5 శాతం కేటాయించడం అంటే ఈ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగంపై ఎంత చిత్తశుద్ధి ఉందో అవగతమవుతుందన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత చదువు కోసం సంజీవని లాంటి ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని ఈ ప్రభుత్వం తూట్లుపొడిచే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. గత 3 సంవత్సరాలుగా దాదాపు రూ.7800 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్లో ఉన్నా ప్రభుత్వం ఏమీపట్టనట్లు వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. రాష్ట్రంలో స్కాలర్షిప్స్, రీయింబర్స్మెంట్ పై ఆధారపడి దాదాపు 15 లక్షల మందికి పైగా విద్యను అభ్యసిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్కాలర్షిప్స్ ఇవ్వకుండా, ఫీజు రీయింబర్స్ చేయకుండా పేద విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టే కుట్ర చేస్తున్నదన్నారు. పేద విద్యార్థులపై ప్రభుత్వ కుట్రలు ఆపి వెంటనే పెండింగ్లో ఉన్న రూ.7,800 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్లను విడుదల చేయాలనీ ఏబివిపి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు.కార్యక్రమంలో టౌన్ మహిళ కన్వీనర్ ప్రణవి మహిళ కో కన్వీనర్ అశ్విని,జాయింట్ సెక్రటరీ కీర్తి,సిరి, వంశీ, స్పోర్ట్స్ ఇన్చార్జ్ శ్రీకాంత్ ఉపాధ్యక్షులు మల్లేశ్వరి, శ్రీవిద్య, అభి, మధు ఎస్ఎఫ్డి కన్వీనర్ యశ్వంత్ కళామంచ్ కన్వీనర్ విజయ్,కార్యవర్గ సభ్యులు ప్రియాంక, హర్షిని, తేజశ్రీ, సౌమ్య, మనోజ్, గణేష్, దయాకర్ విద్యార్థులు పాల్గొన్నారు.




## నష్టపోయిన పంటపొలాలను పరిశీలించి రైతులను ఆదుకుంటామన్న

# ఎమ్మెల్యే బిఎల్ఆర్

**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 25:–** మిర్యాలగూడ నియోజకవర్గం దామరచర్ల, మిర్యాలగూడ మండలాల్లో అకాల వర్షాల కారణంగా జరిగిన వరి పంట నష్టం.. కన్నీరు పెట్టుకుంటున్న రైతులను పరామర్శించి పంట పొలాలను వ్యవసాయ అధికారులతో కలసి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులకు, ప్రభుత్వానికి తెలియజేసి నష్టపోయిన ప్రతీ రైతుకి తగిన నష్టపరిహారం అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఎవ్వరూ అధైర్య పడవద్దని ఇది రైతు ప్రభుత్వం అన్నం పెట్టే రైతన్నకు ఎప్పుడూ అండగా నిలబడతామన్నారు. పంటల పరిశీలనతో రైతులు గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తూ న్యాయం చేయాలని కోరారు.కార్యక్రమంలో దామరచర్ల మండల ఇన్చార్జి మండల వ్యవసాయ అధికారి డి. సైదానాయక్, ఏఈఓలు, కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.







## మద్దివానిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

### ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ మద్ది అంజిరెడ్డి



**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి అక్టోబర్ 25:** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో శుక్రవారం మద్దివానిగూడెంలో పోచంపల్లి పిఎసిఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా .ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భువనగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మద్ది అంజిరెడ్డి హాజరై ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు పిఎసిఎస్ డైరెక్టర్ మద్ది చంద్రారెడ్డి, రైతులు మద్ది గోవర్ధన్ రెడ్డి ,సుదర్శన్ రెడ్డి ,ఇబ్రహీం, తదితరులు ఉన్నారు.

## గురుకులానికి రూ.2.1లక్షల విలువైన ఫర్నిచర్, పుస్తకాలు అందించిన భోగావెల్లి సునీత ఫౌండేషన్

**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 25:-** మిర్యాలగూడ మండలం శ్రీనివాసనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బిసి గురుకుల పాఠశాలకు బోగవిల్లి సునీత మెమోరియల్ ఫౌండేషన్ నుండి రూ.2,00,000ల విలువ గల టేబుల్స్, కుర్చీలు, రాక్స్ 100000/- విలువగల స్టడీ మెటీరియల్ బుక్స్, పోటీ పరీక్షల పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా బిసి గురుకులాల రీజినల్ కో ఆర్డినేటర్ సంధ్య, స్కూల్ ప్రిన్సిపాల్ ఉమాదేవి పాఠశాల అభివృద్ధికి మాజీ సర్పంచ్ బివిఆర్ చౌదరి కృషిని అభినందించారు. టీచర్స్ తో కలిసి సునీత ఫౌండేషన్ చైర్మన్ భోగవిల్లి వెంకటరమణ చౌదరిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.





# పశుగణనకు శ్రీకారం




**భువనగిరి-నవభూమి:** పశు గణనకు ప్రభుత్వ యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం పశు గణనను చేపడుతుంది.కేంద్రం ప్రణాళిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణకు దిగుతోంది. 21వ గణనను పటిష్ఠంగా చేపట్టేందుకు పశు సంవర్ధకశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.. నేటి నుంచి ప్రారంభమయ్యే గణన 28 ఫిబ్రవరి 2025 వరకు కొనసాగనుంది. వివరాల నమోదు అనంతరం తదుపరి నెల నుంచి కొత్త గణాంకాలు అందుబాటులోకి రానున్నాయి. 2019లో నిర్వహించిన పశుగణనలో గతం కన్నా ఏడు శాతం పశువులు తగ్గినట్లు సర్వేలో తేలింది. ఈ సారి పశువుల పెరుగుదల, తగ్గుదలపై ఆందోళన వ్యక్తమవుతోంది.పశుగణనకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. గణకులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 130 మంది ఎన్యూమరేటర్లు సర్వేలో భాగస్వాములు కానున్నారు. ఒక్కో ఎన్యుమరేటర్ గడువులోపు నాలుగు గ్రామాల్లోని ఇళ్లను, పట్టణ ప్రాంతాల్లోని ఇళ్లను సందర్శించి ఎనిమిది రకాల పశువులు గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు, కోళ్లు, గుర్రాలు, గాడిదలు, ఒంటెల వివరాలను యాప్‌లో నమోదు చేయనున్నారు. ఎన్యూమరేటర్ల పనితీరును జిల్లా పశుసంవర్ధక అధికారితో పాటు ముగ్గురు ఏడీలు, 34 మంది పర్యవేక్షకులు పర్యవేక్షణ చేయనున్నారు. ఎన్యూమరేటర్లు నమోదు చేసిన సమాచారం వెంటనే యాప్ ద్వార కేంద్రంలోని యాప్‌లో నిక్షిప్తం అవుతుంది. గతంలో పశుగణనను కొంత సమయంలో హడావుడిగా చేపట్టేవారు. గణనలో శాస్త్రీయత లోపించిందని ఉన్నతాధికారులు భావించి, ఈసారి పకడ్బందీగా చేపట్టాలని నిర్ణయించారు. పారదర్శకంగా..గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని పశువుల సంఖ్యను నమోదు చేయనున్నారు. గతంలో పలు శాఖల ఉద్యోగుల్ని ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసేవారు. ప్రస్తుతం గణన గడువును పొడిగించడంతో పశు సంవర్ధకశాఖ ఉద్యోగులు, శిక్షకులు, ప్రైవేటు వ్యక్తులు గణన కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. గణనలో పారదర్శకత, జవాబుదారీతనం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. గణనపై అన్ని ఆవాస ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉన్న సమాచారంలో ఇళ్లు నమోదు కాకున్నా ఆయా ఇళ్లను పరిగణనలో తీసుకుని వివరాల్ని నమోదు చేస్తారు.కోళ్లు, గొర్రెలు, మేకల సంఖ్య ప్రతి ఐదేళ్లకు ఒకసారి గణనీయంగా పెరగుతుంది. ప్రజల ఆర్థిక స్థితిగతులు పెరగడంతో మాంసం, కోడిగుడ్ల వినియోగం పెరగడంతో కోళ్లు, గొర్రెలు 15 శాతం పెరగడం గమనార్హం.ఏర్పాట్లు పూర్తి:డాక్టర్ కృష్ణ, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి పశుగణనకు ఏర్పాట్లు పూర్తి చేశాం. గణన ప్రక్రియను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో నోడల్ అధికారిని నియమించాం. ఆవాస ప్రాంతంలోని అన్ని ఇళ్లను సందర్శించి ఎన్యూమరేటర్లు వివరాలు సేకరిస్తారు. ఈ విషయమై ప్రజల్లో అవగాహన పెంచేందుకు అన్ని ఆవాస ప్రాంతాల్లో ప్రచారం చేపడతాం.

### రోజుకింత పెచ్చులూడె..

# పరిష్కారం లేదాయె

**నూతనకల్-నవభూమి:** సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగించే సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారి వెంట నూతనకల్ మండలం గుండ్లసింగారం శివారులో పాలేరు ఏటిపై 70 ఏళ్ల కిందట నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది.డంగుసున్నంతో నిర్మించిన ఈ వారధి ధరులు ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు కోతకు గురై దెబ్బతిన్నాయి. వంతెన దుస్థితిని గుర్తించిన 'ఈనాడు' అగస్టు 17న 'ప్రమాదపు అంచున వంతెన' శీర్షికన కథనం ప్రచురించింది. స్పందించిన ఏఈ యుగేంధర్ డీఈ శోభారాణికి సమస్యను తెలుపగా.. డీఈ 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలను జిల్లా ఎస్ఈ, చీఫ్ ఇంజినీర్ రాజేంద్రనాయక్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎస్ ఏటి ప్రవాహంలో నడుస్తూ వంతెన కిందికి వెళ్లి పరిశీలించి ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే కొత్తవంతెన నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు.ప్రతిపాదనలతో సరి సెప్టెంబరు 19న రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపించడంతో 'ఈనాడు'లో 'వారధికి అక్షరం ఆసరా' కథనం ప్రచురించింది. కానీ, నేటికీ నిధులు మంజూరు కాలేదు. కొత్తవంతెన మంజూరవుతుందని ఆశించిన ప్రజలు నిధులు ఎప్పుడు విడుదల చేస్తారా అని నిరీక్షిస్తున్నారు. కూలిపోతున్న వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టకుండా వదిలేయడంతో దానిపైనే భయాందోళనతో రాకపోకలు సాగిస్తున్నారు.అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలకు వంతెన నానిపోయి కోతకు గురై రోజుకింత కూలిపోతోంది.ఏ క్షణాన వారధి కూలిపోతుందో తెలియని పరిస్థితి.నిధులు మంజూరు చేసి నూతన వారధి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.ఆర్థికశాఖ పరిశీలనలో ఉంది శోభారాణి, డీఈ, ఆర్అండ్‌బీ సూర్యాపేట కొత్తవంతెనను రూ.15 కోట్లతో నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధంచేసి ఎమ్మెల్యే మందుల సామేల్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నెలకిందట ఆర్థిక శాఖ ఆమోదానికి పంపాం. నెల రోజుల్లో ఆమోదం లభిస్తుందని ఆశిస్తున్నాం. అప్పటి వరకు ప్రమాదాలు జరుగకుండా వంతెనపై డ్రమ్ములు పెట్టి రిబ్బెన్లు కట్టాం.జాగ్రత్తగా దాటుతున్నాం మల్లయ్య, ఆర్టీసీ డ్రైవర్, తొర్రూర్ డిపో హన్మకొండ-సూర్యాపేట రూట్‌లో బస్సు నడుపుతూ రోజుకు రెండు సార్లు ఈ వంతెన దాటి వెళ్తూ వందల మంది ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేస్తుంటాం. వంతెన వద్దకు చేరగానే ఒక్కసారి బస్సు ఆపి జాగ్రత్తగా దాటాల్సి వస్తోంది. ప్రమాదకరంగా మారిన వంతెన కూలిపోతే సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు కొత్తవంతెన నిర్మించాలి.



# అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు పరిహారం ఇవ్వాలి

### దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన జూలకంటి





**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 25:–** అకాల వర్షాలకు వరి పంట దెబ్బ తిని నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు పరిహారం ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం దామరచర్ల మండలంలోని కేజిఆర్ కాలనీ, దిలావర్ పూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాలలో అకాల వర్షంతో నేలకొరిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసుకున్న రైతులకు అకాల వర్షాలు నిండా ముంచాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నష్టపోయిన పంటల వివరాలు సేకరించి ఎకరాకు 30వేలు ఆర్థిక సాయం చేసి రైతులను ఆదుకోవాలన్నారు. పంటల బీమా పథకం వర్తింపజేయాలన్నారు. రైతులను ఆదుకొని ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా నాయకులు వినోద్ నాయక్, శశిధర్ రెడ్డి, మండల నాయకులు కోటిరెడ్డి, దయానంద్, ధీరవత్ శ్రీను నాయక్, మట్టయ్య, రైతులు పీక్య, శేఖర్ రెడ్డి, వాగ్య ,హన్మ, చిన్య, చంద్రకళ పాల్గొన్నారు.

# శిఖం భూమిని పరిశీలించిన సబ్ కలెక్టర్ నారాయణ అమిత్

### సర్వే నిర్వహించి హద్దులు పెట్టాలని ఆదేశం

**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 25:–** మిర్యాలగూడ పట్టణం తాళ్లగడ్డ అప్పలమ్మ చెరువు శిఖం భూమిని సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ శుక్రవారం పరిశీలించారు. సర్వే నంబర్ 60, 66లోని 3.14 ఎకరాల శిఖం భూమిని కొంత మంది ఆక్రమించారని, గతంలో ఆక్రమించి నిర్మాణాలు చేసిన వాటిని తొలగించగా మళ్లీ నిర్మించిన భవనాలపై పలువురు పలు సార్లు జిల్లా కలెక్టర్, గతంలో ఆర్డీఓలకు, ప్రస్తుత సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు, అక్రమార్కులపై తీసుకోవాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన భూమిని పరిశీలించారు. త్వరలో శిఖం భూమిని సర్వే చేయించాలని హద్దులు నిర్ణయించి రాళ్లు పాతాలని సబ్ కలెక్టర్ స్థానిక తహసిల్దార్ ఎన్.హరిబాబుకు ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐలు సత్యనారాయణ, టీ. రామకృష్ణ, సర్వేయర్ ఎండీ. ఖాద్రీ లున్నారు.



# పీల్చేగాలి.. తాగేనీరు.. ఖరాబు





**మిర్యాలగూడ–నవభూమి:** మిర్యాలగూడలో పరిశ్రమల నుంచి వెలువడుతున్నవ్యర్థపు నీరు గుంతల్లో నిలిచిన తీరు దేశంలో వాయు కాలుష్యంతో ఏటా 33 వేల మంది మృత్యువాత పడుతున్నట్లు జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్ సంస్థ' నివేదికలు ఇటీవల స్పష్టం చేస్తున్నాయి.ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ సంస్థల నివేదికలను సుమోటోగా తీసుకున్న ఎన్‌జీటీ తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి ఈ నెల 21న నోటీసులు జారీ చేయటంతో పాటు వెంటనే కాలుష్యంపై విచారణ ప్రారంభించింది.ఉమ్మడి జిల్లాలో 319 అనుమతి పొందిన భారీ, 84 మధ్యతరహా, 8,069 సాధారణ చిన్నతరహా పరిశ్రమలు ఉన్నాయి.71,687 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. రోజువారీ కూలీలు లక్ష మంది వరకు ఉన్నట్లు అంచనా.2019లో ప్రభుత్వం జీవో 33తో 'జిల్లా స్థాయిలో గాలి నాణ్యత పర్యవేక్షణ కమిటీ'లను ఏర్పాటు చేసినా.. అవి కాగితాలకే పరిమితం కాగా.. ఆచరణలో కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.తెలంగాణ ప్రాంతంలో అత్యధికంగా కాలుష్యం వెలువరించే జిల్లాల్లో హైదరాబాద్ మహానగరం తర్వాత ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రధానంగా ఉంది. ఇక్కడ రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం ఆరోగ్యాలపై ప్రభావం చూపుతోంది. సాధారణంగా కాలుష్య రేణువుల స్థాయి 2.5 మైక్రాన్లు ఉండాల్సి ఉండగా అంతకంటే 1.6 శాతం నల్గొండ జిల్లాలో ఎక్కువగా ఉన్నట్లు వరల్డ్‌హెల్త్ ఆర్గనైజేషన్ గతంలో నివేదించింది. ఈ పరిస్థితిని చూస్తే పెరుగుతున్న పరిశ్రమలతో కాలుష్యం తీవ్రత సైతం అదే రీతిలో పెరుగుతోందని అర్థమవుతోంది.14 ఏళ్ల క్రితమే పీసీబీ ఆందోళన..ఆసియా ఖండంలోనే అత్యధికంగా బియ్యం పరిశ్రమలు ఉమ్మడి జిల్లాలో ఉన్నాయి. 14 ఏళ్ల క్రితం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నీటి, వాయు కాలుష్యం తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ పరిశ్రమల నిర్వాహకులకు మూడు రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహించారు. పరిశ్రమల్లో వ్యర్థపు నీటిశుద్ధి ట్యాంకులు నిర్మించి నీటిని శుద్ధిచేసిన తరువాత బయటకు వదలాలని, మిల్లుల పొగగొట్టాలు 60 అడుగులకు మించి ఎత్తులో నిర్మించాలని ఆదేశించారు. బూడిద, పొట్టు గాలిలో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిమెంటు పరిశ్రమల కాలుష్యంతో గాలి, పరిసరాలు కాలుష్యం పెరిగిపోతుండగా సమస్య తీవ్రరూపం దాల్చుతుంది.ముక్కుమూసుకుని వెళ్లాల్సిందే..హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి దుర్వాసనలు వచ్చాయంటే చాలు చౌటుప్పల్ వచ్చినట్లుగా సంకేతం వస్తుంది. భరించలేని వాసనలు వెదజల్లే పరిశ్రమలు యాదాద్రి జిల్లాలో విస్తరించి ఉండగా వీటి కాలుష్యం వ్యర్థాలు ఒక్కోసారి రహస్యంగా తెచ్చి రహదారుల వెంట పోస్తున్నారు. జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులు ముక్కుమూసుకోకుండా వెళ్లలేని పరిస్థితి కాలుష్య తీవ్రతకు అద్దం పడుతోంది.

# పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలి

**సూర్యాపేట –నవభూమి:** జిల్లాలో పేదరిక నిర్మూలనకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, రచయితలు, కళాకారులు భాగస్వాములు కావాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖిలో గురువారం భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు బాగున్నాయని.. భవిష్యత్తు మహిళా సాధికారతపైనే ఆధారపడి ఉందని చెప్పారు. వైద్యారోగ్యం, విద్యారంగాలను పరిశీలిస్తే జిల్లా మెరుగైన స్థానంలో ఉందన్నారు. 2024లో పదో తరగతిలో 96.91 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులకు విద్యతో పాటు చేతి వృత్తులకు సంబంధించి వస్తువుల తయారీలో మెలకువలు అందిస్తే మరింత విజ్ఞానవంతులు అవుతారని పేర్కొన్నారు.ఘన స్వాగతం జిల్లాకు వచ్చిన గవర్నర్‌కు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, అధికారులు ఘన స్వాగతం పలికారు. తొలుత రాష్ట్ర గవర్నర్ సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లా అధికారులు, ప్రముఖుల ముఖాముఖిలో పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా ప్రాముఖ్యం, సంస్కృతి, సంప్రదాయాలు, వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు తెలియజేశారు. పలువురు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, జాయింట్ సెక్రటరీ భవాని శంకర్, ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్, సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి పురపాలిక ఛైర్‌పర్సన్లు పెరుమాళ్ల అన్నపూర్ణ, గెల్లి అర్చన, అనసూయ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరిస్తాం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూర్యాపేటలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,చిత్రంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం తెలంగాణ రాష్ట్రం కేంద్ర ప్రభుత్వానికి అన్ని విషయాలలో చురుకైన సహకారం అందిస్తోందని, ఆహార భద్రతలో భాగంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల బియ్యం అందజేస్తున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. జనవరి నుంచి సన్న బియ్యాన్ని అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రాబోయే రోజుల్లో సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా చేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని తెలిపారు. సూర్యాపేటకు సంస్కృతి, సంప్రదాయాలతోపాటు చరిత్రాత్మకంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని వెల్లడించారు.





# కులగణన నిర్వహించి బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను పెంచాలి

## బిసి కమిషన్ చైర్మన్‌ను కోరిన బిసి సంక్షేమ సంఘం నేత లింగం గౌడ్



**మిర్యాలగూడ అక్టోబర్ 25:–** బిసి కమీషన్ ఛైర్మన్ నిరంజన్ కు శుక్రవారం బీసీ నేత జాజుల లింగంగౌడ్, కల్లు గీత వృత్తిదారుల సంఘం అధ్యక్షులు అయిలి వెంకన్న గౌడ్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దుర్గయ్య గౌడ్, మహిళా సంఘం అధ్యక్షురాలు పి.మనిమంజరి ఉపాధ్యక్షురాలు సంధ్య శు క్రవారం ఆయనను కలసి కోరారు.తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగణన సర్వే వేగవంతం చేసి బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజ్వేషన్లను కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అధ్వర్యంలో బీసీ కమీషన్ ఛైర్మన్ నిరంజన్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ సమగ్ర కులగణనపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం కల్పించాలని మీడియా ద్వారా ప్రతి పల్లెకు, ప్రతి బస్తికి చేరుకునేలా విసృత ప్రచారం నిర్వహించడానికి కమిషన్ ప్రణాళిక రూపొందించాలని కోరారు.సమగ్ర కులగణనకు తక్షణమే ప్రశ్నావళిని రూపొందించి మార్గదర్శకాలు విడుదల చేసి వారి సామాజిక ఆర్థిక రాజకీయ స్థితిగతులను లెక్కించాలని ఆయన కోరారు. రాష్ట్ర బీసీ కమిషన్ ఈనెల 28 నుండి రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో బీసీ కులాలను అధ్యయనం చేయడం కోసం చేపట్టనున్న జిల్లాల పర్యటనకు బీసీ సంఘాలు కుల సంఘాలు ఉద్యోగ, యువజన, మహిళ సంఘాలు సయుంక్తంగా మద్దతు తెలుపుతున్నాయని కమిషన్ పర్యటనను పూర్తిగా విజయవంతం చేయాలని రాష్ట్రంలోని బీసీ శ్రేణులకు లింగంగౌడ్ కోరారు.

# పంట నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం

**వేములపల్లి, –నవభూమి:** నియోజకవర్గం పరిధిలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతీ రైతుకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకుంటుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లగడ్డ, ఎరుకులగుట్ట, మాడ్గులపల్లి మండలంలోని పోరెడ్డిగూడెం, చిరుమర్తి, పాములపాడు గ్రామాల్లో అకాల వర్షాలకు నేలవాలిన పంట పొలాలను గురువారం వ్యవసాయాధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నేలవాలిన పంట పొలాలను వీడియోకాల్ ద్వారా కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లారు. నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ప్రతీ గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే రూ.2లక్షల రుణమాఫీ చేసిందని, నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దని, వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, నాయకులు పిల్లల సందీప్, ఏడీఏ దేవ్‌సింగ్, మాడ్గులపల్లి ఏవో శివరాంకుమార్, రైతులు పాల్గొన్నారు.



# చింతలపాలెంలో తగ్గని అతిసార వ్యాధి



**చింతలపాలెం–నవభూమి:** చింతలపాలెంలో అతిసార వ్యాధి ఇంకా తగ్గుముఖం పట్టలేదు.వ్యాధి తీవ్రతతో ఇక్కడి నుంచి సూర్యాపేటకు తరలించిన గొంగరెడ్డి శేషిరెడ్డి(35), చింతల వీరభద్రి(60) అనే ఇద్దరు బాధితులు గురువారం రాత్రి మృతి చెందారు. ఈ ఘటనపై డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. కొందరిని సూర్యాపేట ఆసుపత్రికి తరలించిన విషయం వాస్తవమేనని, ఇదే వ్యాధితో చనిపోయారని చెప్పలేమని, మృతి ఘటన గురించి పూర్తి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. వాస్తవంగా ఈ గ్రామంలో గత 20 రోజులుగా వాంతులు, విరేచనాలతో పలువురు అస్వస్థతకు గురవుతున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని హుజూర్‌నగర్, సూర్యాపేట ప్రభుత్వాసుపత్రులకు తరలిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 22న కూడా మెరుగైన వైద్య సేవల కోసం కొందరిని సూర్యాపేట తరలించినట్టు వైద్యులు పేర్కొంటున్నారు.వారిలో ఈ ఇద్దరు మృతి చెందారు. స్వాతి, రాములమ్మ, నాగమ్మ, సత్యనారాయణ, నాగలక్ష్మి, మమత తదితరులు ఈ వ్యాధిబారిన పడగా.. గురువారం రాత్రి కూడా కొందరిని హుజూర్‌నగర్‌కు తరలించారు. ఇక్కడి కొన్ని కాలనీలలోనే అతిసార ప్రబలుతున్న పరిస్థితి కన్పిస్తోంది. కొన్ని బోరు బావులు, మంచినీటి ట్యాంకుల నుంచి సరఫరా అవుతున్న నీటిని వీరు తాగుతున్నట్టు వైద్యులు గుర్తించారు. ఆ నీటిని పరీక్షలకు పంపారు. అవి కలుషితమవుతున్నట్టు తమకు నివేదిక అందిన వెంటనే తాగొద్దని సూచించామని వైద్యులు చెబుతున్నారు. ఇంటింటి సర్వే చేపట్టి వైద్య చికిత్సలు అందిస్తున్నట్టు చెబుతున్నప్పటికీ.. వ్యాధి ఇంకా తగ్గుముఖం పట్టకపోవడం గమనార్హం.

# కంటిపాప జ్ఞాపకంగా.. జ్ఞానాన్ని పంచుతూ

**నీలగిరి–నవభూమి:** తమ ఆశయాలను పిల్లల్లో చూసుకొని మురిసే తల్లిదండ్రులకు.. వారి పేగు బంధం శాశ్వతంగా దూరమైతే ఆ బాధ వర్ణనాతీతం.బిడ్డ దూరమైన బాధ నుంచి ఉపశమనం పొందేందుకు వారిపేరుతో సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం మనం చూస్తుంటాం. కానీ తాము చేసే కార్యక్రమం అందరికీ ఉపయోగపడాలని ఆలోచించిన నాగిరెడ్డి–మంగ దంపతులు కుమారుడి పేరుతో స్థానిక రవీందర్‌నగర్‌లో ఓ భవనం నిర్మించి.. విజ్ఞానాన్ని పంచే విధంగా గ్రంథాలయం, యోగా, ధ్యాన సాధన కోసం అన్ని సదుపాయాలను ఏర్పాటు చేశారు.ఆరోగ్యం.. విజ్ఞానం అందించాలని – నాగిరెడ్డి మా అబ్బాయి ఉన్నత విద్య పూర్తి చేసి ఉద్యోగసాధనలో ఉండగా అనారోగ్యంతో మరణించాడు. లైబ్రరీ సైన్స్ చదువుకున్న కుమారుడు ఫణిందర్‌రెడ్డి పేరుతో ఫణివిహార్ భవనం నిర్మించాం. ఆయనకు పుస్తకాలు అంటే ఇష్టం. అందుకే నిరుద్యోగులు చదువుకోవడానికి పుస్తకాలు, దినపత్రికలతో గ్రంథాలయం ఏర్పాటు చేశాం. దీంతో పాటు రామచంద్ర మిషన్, సత్యసాయి ధ్యాన మండలిలో చేసే సేవా కార్యక్రమాలలో ఎంతో కాలంగా భాగస్వాములు అవుతున్నాం. యోగా సాధన ఉచితంగా నేర్పించేందుకు మాస్టర్‌ని నియమించాం. పోటీ పరీక్షల కోసం చదువుకునే వారు ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడే ఉంటారు.



# సజావుగా పంటల డిజిటల్ సర్వే



**నల్గొండ–నవభూమి:** పంటల డిజిటల్ సర్వేను వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు) గురువారం నుంచి ఉమ్మడి జిల్లాలో చేపడుతున్నారు.నెల రోజులుగా పంటల డిజిటల్ సర్వేపై కొనసాగుతున్న ప్రతిష్టంభన ముగిసింది. హైదరాబాద్‌లోని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో ఏడు రోజులు సర్వేలో పాల్గొంటామని వివరించినట్లు ఏఈవోల సంఘం నాయకులు తెలిపారు.ప్రతిష్టంభనకు కారణమేంటంటే..భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయడం, ఆహార ధాన్యాల ఎగుమతి, పంట ఉత్పత్తుల కొనుగోలు, సాగు ప్రణాళిక తదితరాలకు పంటల డిజిటల్ సర్వే అధారం కానుంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం డిజిటల్ అగ్రి మిషన్ పథకాన్ని తీసుకువచ్చింది. అమలు చేసేందుకు ఆయా రాష్ట్రాలకు నిధులు మంజూరు చేసింది. పథకంలో భాగంగా చేపట్టే పంటల సర్వేకు స్థానిక యువతను ఉపయోగించుకుని ఉపాధి కల్పించాలని సూచించింది. వివిధ రాష్ట్రాల్లో ఇదే విధానం అమలవుతోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏఈవోల ద్వారా సర్వే చేయించాలని చూస్తుండటంతో సమస్య ఉత్పన్నమైంది. ఒక్కో క్లస్టర్ పరిధిలో వేల ఎకరాల భూమి సాగవుతోందని, సహాయకులు లేకుండా సర్వే చేయడం సాధ్యం కాదని ఏఈవోలు చెప్పడంతో ప్రతిష్టంభన కొనసాగింది.చర్చల అనంతరం..పనిభారం ఎక్కువవుతోందని, డిజిటల్ సర్వే చేయలేమని ఏఈవోలు ప్రభుత్వానికి చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం సహాయ సిబ్బందిని నియమిస్తే సర్వే చేస్తామని తెలిపారు. వ్యవసాయశాఖ సంచాలకులతో చర్చల అనంతరం పంటల డిజిటల్ సర్వే చేపట్టడానికి సుముఖత వ్యక్తం చేశారు.వ్యవసాయశాఖ సంచాలకులు హామీ ఇచ్చారు.సత్యనారాయణ ఏఈవోల సంఘ జిల్లా అధ్యక్షుడు, నల్గొండ ఏడు రోజుల పాటు సర్వే నిర్వహించిన తర్వాత ఏఈవోలకు ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వ్యవసాయశాఖ సంచాలకులు హామీ ఇచ్చారు. గురువారం నుంచి పంటల డిజిటల్ సర్వే నిర్వహిసున్నాం. అనంతరం తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే మళ్లీ ఐక్య కార్యచరణతో ముందుకెళ్తాం.

# దక్షిణ మధ్య తీర్థయాత్ర.. శబరిమలకు ప్రత్యేక రైలు

**భువనగిరి –నవభూమి:** భారత్ గౌడ్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్‌లో భాగంగా దక్షిణ మధ్య తీర్థయాత్ర, శబరిమలకు ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ ఎగ్జిక్యూటివ్ టూరిజం సౌత్ జోన్ పవన్ సింగర్ తెలిపారు.భువనగిరి రైల్వేస్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ట్రైన్ వివరాలు వెల్లడించారు. నవంబర్ ఆరవ తేదీన సికింద్రాబాద్ నుంచి తంజావూరు వరకు ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు ఈ రైలును ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. తిరువాన్నామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తంజావూరు మొదలగు పుణ్యక్షేత్రాలను సంతోషించేందుకు ఏర్పాటు చేశారు. ఎకానమీ క్లాసుకు రూ 14250/ వుంటుందని తెలిపారు.నవంబర్ 6 నుంచి 10 నెల 14 వరకు యాత్ర కొనసాగుతుంది. మరో రైలు శబరిమల 16వ తేదీ నుంచి 20 తేది వరకు ఉంటుందని తెలిపారు. దీని సాధారణ ప్యాకేజీ 11,475గా నిర్ణయించి అందుబాటులోకి తెచ్చామన్నారు. టికెట్ల బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌తో పాటు సికింద్రాబాద్ ద్వారా నేరుగా టికెట్లను బుక్ చేసుకోవచ్చు అని వివరించారు